క్లుప్తంగా

పిఠాపురానికి 108 వాహనం ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

పిఠాపురం: పది రోజులుగా పిఠాపురం 108 వాహనం మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడంపై సాక్షిలో 'ఆపద్భాంధవికి అనారోగ్యం' శీర్షికన బుధవారం వెలువడిన కథనానికి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు స్పందించారు. పిఠాపురం సీహెచ్‌సీకి గతంలో కేటాయించిన వాహనం 4.50 లక్షల కి.మీ. ఇప్పటికే తిరిగినందున తరచూ మరమ్మతులకు గురవుతోందని అధికారులు తెలిపారు. దీంతో దానిని మరమ్మతుల కోసం పక్కన పెట్టామని అరబిందో సంస్థ జిల్లా మేనేజర్ అవినాష్ తెలిపారు. ప్రస్తుతం పిఠాపురానికి తాత్కాలికంగా మరో వాహనాన్ని ఏర్పాటు చేసి, వైద్య సేవలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పాత వాహనాన్ని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



మఖ నక్షత్ర పూజలందుకుంటున్న మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, మఖ నక్షత్ర పూజలతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న దాస్

పెద్దాపురం: క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ జి.జాన్‌మోజెస్ దాస్, క్లాప్స్ వ్యవస్థాపకుడు లంక పురుషోత్తమ్ దాస్ అన్నారు. స్థానిక కట్టమూరు పుంతలోని కల్వరి మిరాకిల్ చర్చిలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. క్లాప్స్ కార్యదర్శి నాగ శ్రీనివాస్ జేమ్స్ అధ్యక్షత వహించారు. మంచి ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని వక్తలు సూచించారు. రెవరెండ్ డి.జార్జిమిషన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సుమారు 70 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో రెవరెండ్ డీఎస్‌పీ రావు, జి.సత్యానందం, స్టీఫెన్ చందు, సుకుమార్, జి.విల్సన్, జ్ఞానానందం, మేరీ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వైభవంగా ఊంజల్ సేవ



పిఠాపురంలో వేంకటేశ్వర స్వామికి ఊంజల్ సేవ

పిఠాపురం: పట్టణంలో వేంచేసియున్న తిరుమల తిరుపతి దేవస్థానాల పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊంజల్ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 15 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

హైవేపై ట్రాఫిక్ మళ్లింపు

పిఠాపురం: చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. సభ ప్రాంగణాన్ని మంత్రులతో పాటు కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ బుధవారం రాత్రి పరిశీలించారు. కాకినాడ, కోనసీమ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు కాకినాడ-ఇంద్రపాలెం వంతెన, కెనాల్ రోడ్డు, సామర్లకోట, కిర్లంపూడి, ప్రత్తిపాడు మీదుగా ఎన్‌హెచ్16కు మళ్లించారు. విశాఖపట్నం నుంచి కాకినాడ, కోనసీమ జిల్లాలకు వచ్చే వాహనాలను కత్తిపూడి నుంచి ప్రత్తిపాడు, కిర్లంపూడి, సామర్లకోట, కాకినాడ (కెనాల్ రోడ్డు) మీదుగా మళ్లిస్తున్నారు. విశాఖపట్నం నుంచి కాకినాడ జిల్లా మీదుగా చెన్నై రాకపోకలు సాగించే వాహనాలు ఎన్‌హెచ్16లో యథావిధిగా ప్రయాణిస్తాయని ఎస్పీ తెలిపారు.

అంతం కాదిది ఆరంభం

- వైఎస్సార్ సీపీ 'యువత పోరు'కు విశేష స్పందన
- భారీగా తరలివెళ్లిన యువత, నిరుద్యోగులు
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



యువత పోరుకు భారీగా తరలివెళుతున్న పార్టీ శ్రేణులు, ప్రజలు



పిఠాపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న వంగా గీత

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి యువత, నిరుద్యోగులు పోటెత్తారు. పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాలతో పాటు, పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీల నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావడంతో.. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు మార్మోగాయి. ఇచ్చిన హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం గద్దె దిగాలంటూ యువత డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత ఆధ్వర్యంలో పార్టీ చేపట్టిన యువత పోరుకు అనూహ్య స్పందన లభించింది. బుధవారం పిఠాపురంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న యువత, నిరుద్యోగులు పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీగా బయలుదేరారు. తొలుత వంగా గీత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి కాకినాడకు తరలివెళ్లారు. దీంతో పట్టణమంతా వైఎస్సార్ సీపీ మద్దతుగా, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ, ప్రజలను నమ్మించి, నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వంపై చేపట్టిన ఉద్యమంలో ఇది అంతం కాదని ఆరంభం మాత్రమేనన్నారు. విద్యా రంగానికి, యువతకు, నిరుద్యోగులకు, మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి నేతలు తుంగలో తొక్కారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను కుంటుపడేలా చేసిందని, మహిళలు విద్యలో వెనుకబడే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ, విద్యార్థులకు ఇవ్వాల్సినవి ఇవ్వడం లేదన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అండగా జిల్లా కేంద్రం కాకినాడలో యువత పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థ బాగుంటే, యువత విద్యావంతులై సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందనే సత్సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా పాఠశాల విద్య నుంచి కళాశాలల వరకు అభివృద్ధి చెందాయన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, యువతకు, మహిళలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పిఠాపురం పట్టణ, మండలాల అధ్యక్షులు రావుల మాధవరావు, అడపా రఘు, ఆనాల సుదర్శన్, అరిగెల రామయ్యదొర, రావు చిన్నారావు, గండేపల్లి బాబీ, గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి, కారే శ్రీనివాసరావు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, నిరుద్యోగులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

హోరెత్తిన యువత పోరు

- భారీగా తరలివచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులు
- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన యువత పోరు హోరెత్తింది. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను కోల్పోయిన వారితో పాటు, వారి తల్లిదండ్రులు భారీఎత్తున స్థానిక పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా కాకినాడకు మోటారు సైకిళ్లపై పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోను తుంగలోకి తొక్కి, వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలతో పాటు విద్యార్థులను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వం దిగి వచ్చి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసేలా ప్రజలకు అండగా ర్యాలీ నిర్వహించినట్టు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడం వలన అనేక కార్పొరేట్ కళాశాలల్లో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు అప్పు చేసి, సర్టిఫికెట్లు తెచ్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని విజయవంతంగా అమలు చేశారని చెప్పారు.



సామర్లకోటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దవులూరి సుబ్బారావు తదితరులు



సామర్లకోటలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

మహానేత వైఎస్సార్‌కు నివాళి

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉమ్మడి రాష్ట్ర కార్మిక నాయకుడు దవులూరి సుబ్బారావు దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహిళా కౌన్సిలర్లు, నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప కేక్ కట్ చేశారు. అనంతరం యువత పోరు ర్యాలీ కొనసాగింది. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోరంపూడి రంగనాయకులు, మాజీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్, మండల అధ్యక్షుడు తలారి దొరబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పెద్దాపురం సీనియర్ నాయకులు వినకొండ విష్ణుచక్రం, నల్లల గోవిందు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



యువత పోరుకు మోటార్ సైకిళ్లపై ర్యాలీగా వెళుతున్న దవులూరి దొరబాబు, పార్టీ శ్రేణులు

ప్రమాద రహిత రైల్వేగా తీర్చిదిద్దాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- సామర్లకోట రైల్వే స్టేషన్ తనిఖీ

సామర్లకోట: రైల్వే శాఖ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రమాదాల రహిత రైల్వేగా తీర్చిదిద్దాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కాకినాడ నుంచి ప్రత్యేక రైలులో సామర్లకోట వచ్చిన ఆయన రైల్వే భద్రతకు సంబంధించిన పనులను పరిశీలించారు. కాకినాడ-సామర్లకోట రైల్వే స్టేషన్ల మధ్యలో ఎల్‌సీ గేటును రైలును ఆపి పరిశీలించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె.పద్మజ గేటును నిశిత పరిశీలన చేశారు. అనంతరం మూడో నంబరు ప్లాట్‌ఫారం నుంచి ఒకటో నంబరు ప్లాట్‌ఫారాలను జీఎం పరిశీలించారు. మూడో నంబరు ప్లాట్‌ఫారంపై దిగిన జీఎంకు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్వాగతం పలికారు. ప్లాట్‌ఫారాలపై ఉన్న లిఫ్టును పరిశీలించడంతో పాటు, దాని సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫారంలో స్టేషన్ మేనేజర్ కార్యాలయాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైల్వే సూపరింటెండెంట్ కార్యాలయంలోని సిగ్నల్ వ్యవస్థను పరిశీలించి, డ్యూటీలో ఉన్న ఎస్ఎస్ అనంతలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిగ్నల్ వ్యవస్థలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న ఆర్చి పనులను, వివిధ కార్యాలయాల పనులను, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. స్టేషన్‌కు మంజూరైన రూ.25.37 కోట్ల అమృత్ భారత్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను జీఎంకు డీఆర్‌ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ వివరించారు. రైల్వే స్టేషన్ ఆవరణ విశాలంగా ఉండే విధంగా తయారు చేసిన స్థానిక సిబ్బందిని జీఎం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఉన్నతాధికారులకు అనేక సూచనలు ఇచ్చారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులతో ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాప్, ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె.వెంకట రమణరెడ్డి, సీనియర్ కమర్షియల్ మేనేజర్ బి.రవిచందర్, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బీరజ్ మోహన్ మీనా, ప్రిన్సిపల్ చీఫ్ సెక్షన్ టెలికం ఇంజినీర్ మురళీకృష్ణ, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ నరేంద్ర వర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్లు రాంబాబు, అలీఖాన్, సీనియర్ డీఈఎన్‌లు గౌతమ్, ఎం.కిశోర్, సీనియర్ డీఈఈ సురేష్‌బాబు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, స్థానిక అధికారులు ఏఈడీఎన్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు(వర్క్స్) రవికాంత్, రామసుబ్బారావు(పీడబ్ల్యూఐ) ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను జీఎంకు వివరిస్తున్న డీఆర్‌ఎం

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో వంగా గీత

పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా ప్రజల తరఫున పోరాడుతున్నారని, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో మార్చి 12న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని ప్రారంభించారని గుర్తుచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజల పక్షాన పోరాడుతూ, ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా మారి, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. అటువంటి పార్టీ ఆవిర్భవించడం వల్లే ప్రజలకు మేలు జరిగిందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారంలో ఉన్నా, లేకున్నా.. పార్టీ ప్రజల వెంటే ఉండాలని, వారికి అండగా ఉండాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, వైద్యం, సాగునీరు, తాగునీరు, ఉపాధికి ప్రాధాన్యమివ్వడంతో పాటు, మహిళలు, కార్మికులు, అన్ని వర్గాల వారికి అండగా ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లో ఇచ్చిన హామీలు ఏమీ అమలు చేయకుండా, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. తమకు అండగా ఉన్న వైఎస్సార్ సీపీ కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. పార్టీ ఉన్నంత కాలం దానికి సేవ చేస్తూనే, ప్రజలకు సంక్షేమాన్ని అందించడానికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. నాయకులందరూ సమష్టిగా పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వంతో పోరాడి, వారి హక్కులను అందించడానికి కృషి చేస్తామన్నారు. తొలుత ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వంగా గీత, ఇతర నాయకులు

వాకతిప్పలో..

కొత్తపల్లి: మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వాకతిప్పలో మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేశారు. తొలుత దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్‌కుమార్, గింజల శ్రీను, గోగు జగన్నాథం, వడ్డి నాగమణి, ఆలపు సుధారాణి, అనిశెట్టి సుభాషిణి, కారే శ్రీనివాస్, జ్యోతుల చక్రబ్బాయి, మేరుగు ఎల్లాజీ, సర్పంచ్ పాలని దొరబాబు, ఎంపీటీసీ బర్రె రవి, చబడే హల్లెలూయ, కొవ్వూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవానికి హాజరైన పార్టీ శ్రేణులు



వాకతిప్పలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి చర్యలు

- కమిషనర్ కనకారావు



దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్ కనకారావు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ నామా కనకారావు తెలిపారు. ఆయన బుధవారం గొల్లప్రోలు నగర పంచాయతీలోని మార్కెట్ యార్డులో ఉన్న దుకాణదారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర పంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ప్రస్తుత మార్కెట్ స్థలాన్ని ఎప్పుడో ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రస్తుతం నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయని, త్వరలోనే నిర్మాణం చేపడతామని వ్యాపారులకు వివరించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న దుకాణాలను రాజు చెరువు వద్ద ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం నూతన భవన నిర్మాణం విషయంలో తమను ఖాళీ చేయించకుండా కొందరు వ్యాపారులు కోర్టుకు వెళ్లగా, కోర్టు కూడా దుకాణాలను మార్పు చేసి, మార్కెట్ స్థలంలో కార్యాలయ నిర్మాణానికి ఆదేశాలిచ్చిందన్నారు. దీంతో త్వరలోనే కార్యాలయ నిర్మాణం చేపడతామని, దుకాణదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీఓ నీలిమదీప్తి, ఏఈ ప్రభాకర్, మేనేజర్ నవీన్, దుకాణదారులు పాల్గొన్నారు.

పొన్న వాహనంపై గ్రామోత్సవం



మూలపేటలో పొన్న వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

కొత్తపల్లి: మూలపేటలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారిని బుధవారం పొన్న వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో సదస్యం పండిత సత్కారం నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురువారం స్వామివార్ల రథోత్సవం, శుక్రవారం చక్రస్నానాలు, గ్రామోత్సవం, శనివారం శ్రీపుష్పయాగంతో మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 1,500 మంది సిద్ధం

ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు రాయడానికి 1,500 మంది విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి, పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేశామన్నారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఉంచామని తెలిపారు. మండలంలోని నవర, ఉండూరు, చంద్రంపాలెం, మేడపాడు, వేట్లపాలెం, మాధవపట్నం, పవర, పీబీ దేవం, వీకే రాయపురం గ్రామాల్లో జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయని చెప్పారు. పట్టణంలో బచ్చు ఫౌండేషన్, యార్లగడ్డ అక్కిరాజు, తోట గోపాలకృష్ణ, బీబీఆర్ మున్సిపల్ హైస్కూళ్లతో పాటు, ప్రభుత్వ, జెడ్పీ బాలికోన్నత, గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని వివరించారు. వీటిలో 532 మంది బాలురు, 508 మంది బాలికలు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. అలాగే మండలంలోని 16 ప్రైవేటు పాఠశాలల్లో 235 మంది బాలురు, 225 మంది బాలికలు పరీక్షలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వీరి కోసం వేట్లపాలెంలో రెండు పరీక్షా కేంద్రాలు, నవర, ఉండూరు, వీకే రాయపురం గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లు పరీక్షా కేంద్రాలుగా కేటాయించినట్టు వివరించారు. పట్టణంలో ప్రభుత్వ హైస్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, ప్రతిభా విద్యా నికేతన్‌తో కలిపి 9 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు.

తాటిపర్తిలో టెన్త్ పరీక్షా కేంద్రం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల చిరకాల సమస్యకు పరిష్కారం లభించింది. ఇక్కడ పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటుకు విద్యా శాఖ ఆదేశాలు ఇచ్చింది. తాటిపర్తి జెడ్పీ హైస్కూల్‌లో చదివే తాటిపర్తి, కొడవలి, వన్నెపూడి గ్రామాలకు చెందిన విద్యార్థులు ఏటా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు 15 కిలోమీటర్ల దూరంలో మండల కేంద్రమైన గొల్లప్రోలులో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. తీవ్ర వ్యయప్రయాసలతో వెళ్లి, మిట్టమధ్యాహ్నం మండుటెండలో తిరిగి తమ ఊళ్లకు చేరుకుని తీవ్ర నిస్సత్తువకు లోనయ్యేవారు. హైవేను దాటుకుని పరీక్షా కేంద్రానికి వెళ్లిన తమ పిల్లలు తిరిగి ఇంటికి వచ్చేవరకూ తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. ఈ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, విద్యార్థులు దూరంగా ఉన్న గొల్లప్రోలు వెళ్లనవసరం లేకుండా, పదో తరగతి పరీక్షలు తాటిపర్తి హైస్కూల్ లోనే రాసేలా సెల్ఫ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు విద్యార్థులకు హామీ ఇచ్చారని అధికారులు తెలిపారు. ఆయన చొరవతో ఈ ఏడాది నుంచే తాటిపర్తి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు నిర్వహించేలా సెల్ఫ్ సెంటర్ ఏర్పాటు చేయించారన్నారు. ఈ నెల 17 నుంచి జరిగే టెన్త్ పరీక్షలను తాటిపర్తి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.



తాటిపర్తి జెడ్పీ హైస్కూలు

సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలి

- డీఎల్‌పీఓ అమ్మాజీ

సామర్లకోట: ప్రతీ గ్రామంలోను సంపద తయారీ కేంద్రాలను విజయవంతంగా నిర్వహించాలని డీఎల్‌పీఓ అమ్మాజీ అన్నారు. పెద్దాపురం, సామర్లకోట మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు ప్రతి గ్రామం నుంచి ఒక గ్రీన్ అంబాసిడర్‌కు ఒక రోజు శిక్షణను జి.మేడపాడు వర్మీ కంపోస్టు యూనిట్‌లో ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి సర్పంచ్ పటాని దేవి అధ్యక్షత వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ, గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్యదర్శులకు తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన ఉండాలన్నారు. ప్రతీ గ్రామంలో తడిచెత్త, పొడిచెత్త డస్ట్‌బిన్లను ప్రతి ఒక్కరూ ఉపయోగించేలా చూడాలని సూచించారు. ఈఓపీఆర్డీ భైరవమూర్తి మాట్లాడుతూ, ఆయా గ్రామాల్లోని పాడి రైతులతో పేడ ఒప్పందం చేసుకోవాలన్నారు. చెత్తను వర్మీ కంపోస్టు యూనిట్లకు తరలించే సదుపాయం ఉండాలన్నారు. యూనిట్లలో తయారు చేసిన వర్మీ కంపోస్టుతో మొక్కల పెంపకం చేసి, వాటిని రైతులు, గ్రామ ప్రజలు సందర్శించే విధంగా చూడాలన్నారు. వర్మీ కంపోస్టుకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఏర్పడుతుందని, ప్రతి గ్రామంలో ఈ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు.



తడిచెత్త, పొడిచెత్త సేకరణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఓపీఆర్డీ